



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 21-12-2023 సంపుటి : 06 సంచిక : 100 పేజీలు : 8 వెల : రూ 3-00

# యుద్ధాన్ని త్వరగా ముగించాలి

**నెతన్యాహుకు ప్రధాని మోదీ సూచన**
**ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధంపై ప్రధాని వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ,డిసెంబర్20 ): ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధానికి అతి త్వరగా శాంతియుత మార్గంలో ముగింపు పలకాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బందీలను దౌత్యపరమైన చర్చల ద్వారా విడిపించుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. గాజా ప్రజలకు మరింతగా మానవతా సాయం అందాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాని మోదీకి మంగళవారం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరు దేశాల ప్రధానుల మధ్య చర్చలు జరిగాయి. ఇటీవల జరిగిన పరిణామాల గురించి నెతన్యాహు మోదీకి వివరించారు. చర్చలు ఫలప్రదంగా సాగాయని ఆ తర్వాత మోదీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. అయితే ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌకలపై జరగుతున్న దాడులపట్ల ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బాబ్ ఎల్- మండెప్ ప్రాంతంలో ఆ నౌకలకు రక్షణ కల్పించే చర్యల దిశగా వారి చర్చలు సాగాయి. ఇరాన్ మద్దతుతో హౌతీ రెబల్స్ దాడులు చేయడం గురించి ఇరు దేశాల నేతలు మాట్లాడుకున్నారని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

# జగనన్న విద్యాదీవెన కింద

**రూ.41.59 కోట్లు ఫీజులు విడుదల**
**సివిల్స్‌కు ఎంపికయిన విద్యార్థులకు అందచేత**
**చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉందన్న సిఎం జగన్**





అమరావతి,డిసెంబర్20(ఆర్ఎన్ఎ): జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి, సివిల్స్ పురస్కారం కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్ బుధవారం నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... మంచి యూనివర్సి టీల్లో సీటు పోందితే ఫీజు ఎంత యినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ ఏడాది 51మందికి అడ్మిషన్ ఇస్తున్నారని.. రూ.41.59 కోట్లు ఫీజులు ఇప్పుడు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా పొందిన ఈ సహాయాన్ని మర్చిపోకు ఒడా తిరిగి రాష్ట్రానికి కంట్రిబ్యూట్ చేయాలన్నారు. 408 మందికి నేడు ప్రభుత్వం సాయం అందిస్తుం దన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని యువత కలలు కంటుం దని.. దీనికి కూడా మరో కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ఎవ్వరైనా ప్రిలిమ్స్ పాస్ అయితే లక్ష రూపాయలు.. మెయిన్స్‌కు వెళితే లక్షన్నర ఇస్తున్నామన్నారు. 95 మందికి సివిల్స్ ప్రోత్సాహకం ప్రిలిమ్స్ కింద లక్షరూపాయలు, 11 మంది మెయిన్స్ క్లియర్ చేసిన వారికి లక్షన్నర అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎల్లయ్య, పుల్లయ్య కాలేజీ లకు విద్యార్థులను పంపించా రన్నారు. అందుకే స్కీములలో మార్పులు చేర్పులు చేశామని సీఎం జగన్ వెల్లడించారు. ఈ క్రమంలో జగనన్న విదేశీ విద్యాదీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ. 41.59 కోట్లను.. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమచేశారు. వీరిలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన 95 మందికి లబ్ది చేకూరను ంది. అదే విధంగా 95 మందిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధిం చిన 11 మంది లబ్ది పొందనున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. చదువుకునేందుకు పేద విద్యార్థులు ఇబ్బంది పడకూ డదని అన్నారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడొద్దని తెలిపారు. పేద విద్యార్థుల చదువు లకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని అన్నారు. విదేశాల్లో చదవాలనుకునే పేద విద్యార్థుల కల నెరవేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి, వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల తలరాత మార్చేందుకే విదేశీ విద్యా దీవెన పథకమని సీఎం జగన్ పేర్కొన్నారు. విదేశీ విద్యాదీవెన కింద రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు విదేశాల్లో టాప్ యూనివర్సిటీలో చదువు తున్నారని, వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే ప్రిలిమ్స్ పాసైతే లక్ష, మెయిన్స్‌కు క్వాలి÷ అయితే లక్షన్నర ఇస్తున్నామని తెలిపారు. రూ. 8 లక్షల వార్షికాదాయం ఉన్న వారందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన అందుతుందని చెప్పారు. అన్ని జిల్లాల నుంచి పార్టిసిపేట్ చేస్తున్న కలెక్టర్లు, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, విదేశీ దీవెన పొందుతూ అక్కడ చదువుతూ వీసీల్లో పాల్గొంటున్న వారందరికీ అభినందనలు. రాష్ట్రంలో ఎవరికైనా కష్టపడి చదివితే మంచి యూనివర్సిటీల్లో సీటు వస్తే ఫీజులు ఎంతైనా మనం ఇబ్బంది పడాల్సిన పని లేదు, మన తల్లిదండ్రులకు, మనకు ఎటువంటి అప్పు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం తోడుగా ఉంటుంది, జగనన్న తోడుగా ఉంటాడన్న భరోసా ఈ కార్యక్రమం ద్వారా జరిగిస్తున్నామని జగన్ అన్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లోగానీ, లేదా క్యూఎస్ ర్యాకింగ్స్‌లో గానీ టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీలు కవర్ చేస్తూ 350 కాలేజీలు.. వీటిలో సీట్లు ఎవరికి వచ్చినా కూడా రాష్ట్రం నుంచి ఎంటైర్ ఫీజు చెల్లిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సంబంధించిన వారికి రూ.కోటీ 25 లక్షల దాకా, మిగిలిన వారికి రూ.కోటి దాకా తోడుగా నిలబడే కార్యక్రమం జరుగుతోంది. 51 మందికి కొత్తగా అడ్మిషన్లు వచ్చాయి. ఈ సీజన్ లో ఫీజులు చెల్లించాల్సిన 390 మందికి వాళ్ల ఫీజు కలుపుకుంటే రూ.41.59 కోట్లు ఇస్తున్నాం. దాదాపుగా రూ.107 కోట్లు 408 మంది పిల్లల కోసం ఈ పథకం పెట్టినప్పటి నుంచి ఖర్చు చేస్తున్నాం. ఈ పథకం ఎంత సంతృప్తినిస్తుందంటే.. ఇదొక యాస్పిరేషన్. మిమ్మల్ని చూసి మిగిలిన వాళు స్ఫూర్తి పొంది, టాప్ కాలేజీలలో సీట్లు తెచ్చుకొని మీ తలరాతలు మారడానికి ఉపయోగపడాలి.ఎక్కడో ఒక చోట కెరీర్‌లో గొప్పగా ఎదిగిన తర్వాత.. ఈ తరహా సాయం రాష్ట్ర ప్రభుత్వం మీకు అందించిందో.. అది ఎక్కడో ఒక చోట మన రాష్ట్రానికి కూడా కొంత కాంట్రిబ్యూషన్ ఇవ్వగలగాలి. మంచి సీఈవోలుగా పెద్ద పేరు తెచ్చుకుంటే రాష్ట్రాన్ని గుర్తు పెట్టుకొని మన పిల్లలకు మీరు మంచి చేయాలన్నదే మా తాపత్రయం, నా కోరిక. ఈ ఫీజులు ఆశ్చర్యకరం అనిపించేలా ఉన్నాయన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం జగన్




విజయవాడ: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు.కాగా, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. విజయవాడలో జరుగుతున్న వేడుకలకు సీఎం జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. క్రిస్మస్ సందర్భంగా సీఎం జగన్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు సందేశం ఇచ్చారు అని స్పష్టం చేశారు. అనంతరం, కొవ్వొత్తులు వెలిగించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక, ఇదే సమయంలో పలు రంగాల్లో విశేష కృషి చేసిన వారికి సీఎం జగన్ అవార్డులను ప్రదానం చేశారు.

# రూ.42 కోట్లతో నిర్మించిన నాగలదిన్నె వంతెనను ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్..

**-మూడు రాష్ట్రాల ప్రజలకు కీలకమైన వంతెన అందుబాటులోకి..**

విభారె న్యూస్ డిసెంబర్ 20 ఎమ్మిగనూరు..20-12-2023 తేదీన ఎమ్మిగనూరు మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు కీలకమైన నాగలదిన్నె వంతెనను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్,ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" ప్రారంభించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం మండలంలో రూ.42 కోట్లతో నిర్మించిన నాగలదిన్నె హైలెవెల్ వంతెన నిర్మాణం ఎమ్మిగనూరు ప్రజలకోసం చేసిన శాశ్వత అభివృద్ధిగా మిగులుతుందని మంత్రి పేర్కొన్నారు. నాగలదిన్నె బ్రిడ్జిని పూర్తి చేయడం కోసం ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" పడ్డ శ్రమ, తపన మాటల్లో చెప్పలేనిదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. 2009లో కర్నూలు వరదల వల్ల పాత వంతెన కొట్టుకుపోయిన తరుణంలో 2011లో కొత్త వంతెనను నాటి ప్రస్తుత ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" మంజూరు చేయించుకున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. అనేక కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణానికి పదేళ్ల కాలం పట్టినా ఎట్టకేలకు పట్టువదలకుండా ఎన్ని అవాంతరాలొచ్చినా అధిగమించి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. ప్రజలకు ఎంతో అవసరమైన ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే అడగ్గానే అంగీకరించిన విషయాన్ని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. త్వరలోనే తుంగభద్ర నదికి అవతల ఉన్న రహదారిని మరింత సామర్థ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. పాత వంతెనతో పోల్చితే ఎత్తు, పొడవు, సామర్థ్యవంతంగా భవిష్యత్ లో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా నిర్మించినట్లు ఆయన తెలిపారు.



వంతెనలు, రహదారులు, భవన నిర్మాణాల వంటి శాశ్వతంగా నిలిచిపోయే పనులకు సీఎం ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తమ ప్రాంతానికి విచ్చేసిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కు స్థానిక ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి", అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సర్పంచ్ లక్ష్మి, ఆర్ అండ్ బి ఎస్ ఈ నాగరాజు, ఈఈ కృష్ణా రెడ్డి, జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న విదేశీ విద్యాదీవెవ- రు.34.88 లక్షలు.

**లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ.**
**జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 20- 2023-24సంవత్సరానికి "జగనన్న విదేశీ విద్యా దీవెన" మరియు "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" పథకాల క్రింద 34. 88 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లను... సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలను మొత్తం రూ.42.60 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేసే బృహత్తర వర్చువల్



కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, మైనారిటీ సంక్షేమ అధికారులు విద్యార్థులు, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం, ఆర్థిక పరిస్థితుల కారణంగా విదేశాలలో చదువుకోలేని విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో 2023-24 సంవత్సరానికి "జగనన్న విదేశీ విద్యా దీవెన" పథకం క్రింద నలుగురు విద్యార్థులకు రూ.33.65 లక్షలు మరియు "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" క్రింద ఒక విద్యార్థికి లక్ష రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత పదవులను అలంకరించాలని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు.

# సంపాదకీయం

గురువారం 21-12-2023

## దేశంలో ఆర్థిక అరాచకం !

మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసామా లేదా అన్నది సమీక్షించుకునే సమయం ఆసన్నమైంది. పార్లమెంటులో సభ్యులను మూకుమ్మడిగా సస్పెండ్ చేయడ మన్నది నిరంకుశ విధానాలకు పరాకాష్టగా చూడాలి. సమస్యలపై చర్చించాలన్న సంకల్పం లోపించింది. అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నా..ఆదానీ, అంబానీలకు, ఇతర కార్పోరేట్లకు దోచిపెట్టారన్న విమర్శలు ఉన్నాయి. పార్లమెంటులో చర్చలేకుండా చేయాలన్న సంకల్పం సరికాదు. అంశం ఏదైనా, సందర్భం ఏదైనా చర్చకు అదికారపక్షం ఎప్పుడూ సిద్దంగా ఉండాలి. అప్పుడే దేశంలో ఏం జరుగుతుందో తెలుస్తుంది. కానీ దానిని పక్కన పెట్టి కేవలం విపక్షాలది రాజకీయం అంటూ 141 మంది ఎంపిలను సభనుంచి బయటకు పంపి ఏం సాధిస్తారో చెప్పాలి. వారంతా ప్రజలతో ఎన్నికైన ప్రతినిధులుగా గుర్తించకపోవడం దారుణం. ఇది పాలకపక్షం అహంకారానికి పరాకాష్టగానే చూడాలి. ఓ రకంగా కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా మోడీ రాజకీయాలు చేస్తున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జివెస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చిపెట్టాయి. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు ప్రచారం చేసుకోవడం మినహా ఇతర విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అమిత్‌షా, మోడీ ద్వయం రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి సఫలం అయ్యారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ,షాలకు కూడా పెద్దగా తేడా ఉండడం లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడా లన్నది ఈ ఇరువురి నాయకుల కోరికగా ఉంది. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నంగా ఉండలేకపోతోంది. ఇకపోతే ప్రధాన సమస్యలపై దృష్టి సారించడం లేదు. రూపాయి విలువ పడిపోతున్నా పైకి లేపడం లేదు. ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా తయారయ్యింది. నిత్యావసరాల ధరలు, ఉల్లిగడ్డ ధరలు, బియ్యం ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. ఈ క్రమంలో దేశంమే కాదు..రాష్ట్రాలు కూడా అప్పులు ఊబిలో కూరుకుపోతున్నాయి. రాష్ట్రాలను కంట్రోల్ చేయాల్సిన కేంద్రం కూడా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ దేశాన్ని అగాథంలోకి నెడుతుంది. రాష్ట్రాలను అజమాయిషీ చేయాల్సిన కేంద్రం చేతులెత్తేస్తోంది. కేంద్రం కూడా అదే దారిలో నడిస్తే మరి ప్రశ్నించే వారు ఎవ్వరన్నదే ఇప్పుడు ప్రశ్న. ఇలా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నా దేశంలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ధరలు దిగి రావడం లేదు. జివెస్టీ వాతలు తగ్గడం లేదు. గ్యాస్,పెట్రో ధరలు తగ్గలేదు.నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మేస్తున్నారు. అయినా ఈ డబ్బు ఎక్కడికి పోతుందన్నది తెలియాలి. దీనిపై సమగ్ర చర్చ చేయాలి. రాష్ట్రాలు చేస్తున్న అప్పులతో పాటు..కేంద్రం చేస్తున్న అప్పుల పైనా చర్చించాలి. ఇలా పాలకులు ప్రజలను మభ్యపెడుతూ పోతుంటే నష్టపోయేది ప్రజలే. అందువల్ల దీనిపై పార్లమెంట్ ప్రత్యేకంగా చర్చించాలి. కానీ ఎలాంటి చర్చలకు అక్కడ స్థానం లేకుండా పోయింది. అధికారం అప్పగించాం కదా అని ఇష్టారీతిన అప్పులు చేస్తే కట్టేది ఎవరు. జివెస్టీ వసూళ్లు లక్షా40 వేల కోట్లకుచేరినా అప్పులు చేయాల్సిన అవసరం ఎందుకు వస్తోంది. కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ అప్పులు పెరిగిపోతున్నాయి. నిజానికి ఇంతగా అప్పులు చేసి ఏం చేస్తున్నారన్న దానిపైనా వివరణ రావాల్సి ఉంది. ప్రజలు కూడా పాలకులను అప్పులపై నిలదీయాలి. అలాగే అప్పులపై అజమాయిషీ ఉండాల్సిందే. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర, రాష్ట్రాలు అన్న తేడా లేకుండా అప్పులు పెరుగుతున్నాయి.

## ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలి.... యూటీఎఫ్





విభారే న్యూస్ డోన్ మాప్రతినిధి :- డిసెంబర్ 20 డోన్ మండల కేంద్రంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి కార్యాలయంలో వారి వ్యక్తిగత కార్యదర్శి కి యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి,డోన్ మండల అధ్యక్షుడు బివై సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి గోపాల్, క్రిష్ణగిరి మండల అధ్యక్షుడు రామమూర్తి, ప్యాపిలి మండల అధ్యక్షుడు క్రిష్ణా నాయక్,ప్రధాన కార్యదర్శి నరసింహా రెడ్డి ఒకటవ తేదీన జీతాలు ఇవ్వాలని, పిఎఫ్,ఏపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, పిఆర్పీ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మెమోరాండం ఇచ్చారు.అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి, మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. మన ముఖ్యమంత్రి కూడా సిపిఎస్ రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూటీఫ్ నాయకులు బాలరంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్,షంషాద్ బేగం,సుమన్, కలాం, రాజశేఖర్, అంజనప్ప,లతీఫ్, చంద్రమోహన్, మురళి కృష్ణ, మధు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు చేస్తున్న సమ్మె న్యాయమైనదే.



విభారె న్యూస్ డిసెంబర్ 20 కర్నూలు (జిల్లా ప్రతినిధి). గత తొమ్మిది రోజులుగా అంగన్వాడీల సమస్యలు న్యాయపరమైనవేనని జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పోతుల శేఖర్ తెలియజేశారు. బుధవారం ధర్నా చౌక్ నందు అంగన్వాడీలు చేస్తున్న దీక్షకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటే అధికంగా 1000 రూపాయలు ఇస్తామని చెప్పి,తెలంగాణ ప్రభుత్వము 18,000 ఇస్తుంటే జగన్మోహన్ రెడ్డి 11,500 రూపాయలు ఇస్తూ, మాట తప్పి మడమతిప్పిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని రాష్ట్రవ్యాప్తంగా 56000 అంగన్వాడి సెంటర్లు ఉన్నాయని ఇందులో 1,25,000 మంది పనిచేస్తున్నారని, సుప్రీంకోర్టు కనీస వేతనము 26,000 జీతము ఇస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి 15% వారి జీతం నుండి గ్రాచుటీ కింద తీసి వారికి పెన్షన్ సౌకర్యం కూడా కల్పించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ లు ఇవ్వాలని, 62 సంవత్సరాలు రిటైర్మెంట్ వయసు పెంచాలని, ఇవి గొంతెమ్మ కోరికలు కాదని, న్యాయమైనవని వీటిని తక్షణమే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి పోతుల శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రియాజుద్దీన్, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ నూర్ అహ్మద్, మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ వసీం భాష, జిల్లా కార్యదర్శి ఎజాస్, కాంగ్రెస్ నాయకులు మాలిక్ భాషా, నాగేశ్వరరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ పోటీల్లో భాష్యం విద్యార్థుల విజయకేతనం.

విభారె న్యూస్ డిసెంబర్ 20 ఎమ్మిగనూరు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కర్నూల్ లో జరిగిన అబాకస్ పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. బుధవారం స్థానిక స్కూల్లో ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ కర్నూల్లో భాష్యం జోనల్ లెవెల్ లో జరిగిన అబాకస్ పోటీల్లో మా స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు.ఈ పోటీల్లో రాకేష్ రెడ్డి ఫస్ట్ ర్యాంక్,రవి వెంకట సాయి సెకండ్ ర్యాంకు, నరేంద్ర సెకండ్ ర్యాంకు, పూర్ణిమ సెకండ్ ర్యాంక్,ఇషితా సెకండ్ ర్యాంక్,రాహుల్ థర్డ్ ర్యాంక్,సంజన థర్డ్ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.విద్యార్థులను ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం అభినందించారు.ఈ కార్యక్రమంలో చాంప్స్ ఇంచార్జ్ అనురాధ, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



# జగనన్న పాలనలో అడుక్కుతినే పరిస్థితులు..

### రోడ్డున పడ్డ అంగన్వాడీలు 9వ రోజు సమ్మె లో బిక్షాటన ఉద్యమం ఉధృతం.... సీఐటీయూ





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 20 డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె 9వ రోజు కొనసాగింది.బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం,పట్టణ పోలీస్ స్టేషన్,గాంధీ చౌక్,పాత బస్టాండ్,కంబాలపాడు సర్కిల్ తదితర ప్రాంతాల నందు అంగన్వాడీలు బిక్షాటన చేసి ప్రభుత్వంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ,మండల అధ్యక్షులు నకిశ్రీకాంత్,పి. రామాంజనేయులు,మండల కోశాధికారి బి.నాగమద్దయ్య, ప్యాపిలి మండల కార్యదర్శి చిన్న రహిమాన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళు రహమద్ బి,సుమలత, యశోద,నాగలక్ష్మి,గుల్జార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అంగన్వాడీలకు అడుక్కుతినే పరిస్థితులు దాపురించాయని 9 రోజుల నుండి సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా,దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్లను సచివాలయ సిబ్బందితో నడపాలని నిర్ణయించడం అన్యాయమని,సెంటర్లను సచివాలయాలకు అప్పగిస్తామంటే సహించమని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాళాలు బద్దలు కొడితే సెంటర్లు నడవవని టీచర్లు,ఆయాలు ఉంటేనే సెంటర్లు నడుస్తాయన్న జ్ఞానోదయం ప్రభుత్వానికి త్వరలోనే బోధపడుతుంది అన్నారు.ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రోత్సహించడం సిగ్గుచేటు అని,సమ్మె వల్ల కలిగే పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని,ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు తక్షణమే స్వస్తి పలికి సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని,కార్మిక వర్గం కన్నెర్ర చేస్తే రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు.జగన్మోహన్ రెడ్డి గారు ప్రతిపక్ష నేతగా గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మళ్లీ ఎన్నికలు వచ్చినా అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు,మినీ వర్కర్లకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు,ఆఖరి వేతనంలో 50% పెన్షన్, హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించడం, రాజకీయ జోక్యం అరికట్టడం,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచడం సర్వీస్ లో ఉండి చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం,బీమా అమలు చేయడం,రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం,వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచడం,గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయడం, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు,ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని,లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని,వివిధ రకాల యాప్ లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## అంగన్వాడిలకు జిల్లా ఐ ఎన్ టి యు సి సంపూర్ణ మద్దతు..



విభారె న్యూస్ డిసెంబర్ 20 కర్నూలు (జిల్లా ప్రతినిధి) వారి న్యాయమైన కోరికలు పరిష్కారానికి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు జిల్లా ఎన్టియుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతకన్న తెలియజేశారు. బుధవారం కర్నూల్ నగరం మండలి ధర్నా చౌక్ నందు చేపడుతున్న అంగన్వాడీలు చేపడుతున్న నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతూ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ సంజీవరెడ్డి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిసిసి అధ్యక్షుడు కే బాబు రావు ఆదేశాల మేరకు ఈరోజు అంగనవాడి కార్యకర్తలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని అంగన్వాడి సమస్యలు నేటికి తొమ్మిది రోజులు అవుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని వీరి న్యాయమైన కోరికలు తక్షణమే పరిష్కరించాలని లేదంటే మా కార్మిక సంఘాలన్నీ ఏకమై ప్రభుత్వ మెడలు వంచి సమస్య పరిష్కరించే వరకు పోరాడుతామని వచ్చే ఎలక్షన్లో నీకు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయని బి బతుకన్న హెచ్చరించాడు. ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి కే ఆనందం మాట్లాడుతూ ఓట్లు అడిగేటప్పుడు ఒక లెక్క సమస్యలు తీర్చకుండగా నిమ్మకు నీరెక్కినట్టు ఉండడం పద్ధతి కాదని కర్నూలు నియోజకవర్గం ఐఎన్టియుసి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే నీలాంటి వ్యక్తిని చూడలేదని సమస్యలు పట్టించుకొనకుండ పాలన చేస్తున్నావని అన్నాడు పేపర్ మిల్ ఎంప్లాయ్ గిరి మద్దిలేటి మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వాలు సమస్య వచ్చినప్పుడు తెలుసుకొని సమస్యలు తీర్చేవారని కోడుమూరు నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడుతూ ఎందుకింత నిర్లక్ష్యంగా ఉన్నావని నిన్ను నువ్వు ఒక పారి పరిశోధన చేసుకో అని అదేవిధంగా ఐఎన్టిసి జిల్లా ఉపాధ్యక్షుడు జేమ్స్ మాట్లాడుతూ చిన్న సమస్యని పెద్దగా పెంచుకున్నావు జగన్ తక్షణమే ఈ సమస్య తీర్చాలని అన్నాడు

## కేంద్రంలో బేడ బుడగ బుడగ జంగం కులమునకు న్యాయం చేయండి - తూర్పాటి మనోహర్.

విభారె న్యూస్ డిసెంబర్ 20 కర్నూలు (జిల్లా ప్రతినిధి).ఢిల్లీ నందు బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాస్త్రి భవన్ నందు సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఇండియా ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్ గార్గ్ , అలాగే సోషల్ జస్టిస్ సహాయక మినిస్టర్ నారాయణ స్వామి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి బేడ బుడగ జంగం కమ్యూనిటీకి సంబంధించిన రిపోర్టు అసెంబ్లీలో, క్యాబినెట్లో, తీర్మానం చేయబడి, కేంద్రానికి పంపడం జరిగినది. ఆ యొక్క నివేదికను నేషనల్ రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా నుండి త్వరగా స్వీకరించి, పార్లమెంట్ (లేక) కేంద్ర క్యాబినెట్లో గాని ఆమోదింపజేసి, గౌరవ రాష్ట్రపతి ద్వారా షెడ్యూల్డ్ అమెండ్మెంట్ 2002 నీట 61 యాక్ట్ నందు ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం కులమును సవరణ (ఇంక్లూడింగ్ ) చేసి న్యాయం చేయవలసిందిగా, ఆ జాతి నేత తూర్పాటి మనోహర్, కార్యదర్శి సిరిశాల అంజి కోరడం జరిగినది. వీటికి పైవారు స్పందించి న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపినారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వివిధ పార్లమెంట్ సభ్యులను, ఢిల్లీ నందు ఎంపీ క్వార్టర్స్ లో కలిసి, మా జాతికి న్యాయం చేయాలని తమదైన శైలిలో పార్లమెంటులో ప్రస్తావించి, వీలు పడితే ఈ సమావేశంలోనూ (లేక) ఫిబ్రవరిలో జరిగే 2024 పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించి, న్యాయం చేసే విధంగా చూడాలని కోరడం జరిగినది. వీటికి వారు స్పందించి న్యాయం జరిగే విధంగా మా వంతు చూస్తామని తెలిపారు.



## సోమిరెడ్డి దీక్ష భాగస్తుడు కోసం

### మంత్రి కాకాణి

నెల్లూరు,మాజీమంత్రి సోమిరెడ్డి తాటిపర్తి మైన్ దగ్గర చేస్తున్న దీక్ష జనం కోసం కాదు, భాగస్తుడుకోసమని మంత్రి కాకాణి అన్నారు.ఇలాంటి దీక్షలు జనం సమ స్యలకోసం చేయాల నీ సలహా ఇచ్చా రు.ఇక సోమిరెడ్డి చాప్టర్ క్లోజ్ అంటూ ఘాటైనా వ్యాఖ్యలు చేశారు.సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలో నిజం లేదని అన్నారు.

## వైకాపాలో మగాళ్లే లేరు

నెల్లూరు,వైసీపీ లో మగాళ్లే లేరని ఎద్దేవా చేశారు టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి. అక్రమ మైనింగ్ పై సోమిరె డ్డి చంద్రమోహన్ రెడ్డి చేస్తున్న ఆందోళ నను అడ్డుకునేందుకు హిజ్రాలను పం పడంపై ఆయన మండిపడ్డారు. వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం లేకపోవడంతో నే హిజ్రాలను పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హిజ్రాల పార్టీ అని పెట్టుకోవాలని సూచించారు. వైసీపీ ఎమ్మెల్యేలందరికీ చీరలు, పూలు పంపిస్తామని.. ఇకపై హిజ్రాలతోనే తిరగాలంటూ ఛలోక్తులు విసిరారు.

### కూలిన వంతెన..రాకపోకలు నిలిపివేత

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా బుచ్చ య్యపేట మండలం విజయరావ రాజుపేట నుంచి వడ్డాది వైపు వెళ్లే రోడ్లో బ్రిడ్జి ఒకపక్క కుంగిపో యింది. అదృష్టవశాత్తు వాహనాలు ఏవీ ఆ సమయంలో లేవు. పోలీసు లు వచ్చి బ్రిడ్జ్ పైనుంచిచ వాహనాల రాకపోకలను నిలిపివేసారు

### వాహనాలకు నిప్పు పెట్టిన మావోయిస్టులు

బీజాపూర్,గడ్చిరోలి జిల్లా భమ్రాగడ్ ఎటపల్లి తాలూకాలో నక్సలైట్లు మళ్లీ విరుచుకపడ్డారు. ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లకు నిప్పు పెట్టారు. భామ్రగడ్ తాలూకాలోని హిదూర్ పొయిర్కోటి రోడ్డు పనులు కొన్ని రోజుల నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి పది గంటల ప్రాంతంలో నక్సలైట్లు ఈ పని వాహనం ఉన్న ప్రదేశానికి వచ్చి వాహనాలకు నిప్పు పెట్టారు. భమ్రాగఢ్ తాలూకాలోని హిదూర్లో ఘటన జరిగింది

### నాగలదిన్నె వంతెనను ప్రారంభించిన మంత్రి బుగ్గన

కర్నూలు,మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు కీలకమైన నాగలదిన్నె వంతెనను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని నందవరం మండలంలో రూ.42 కోట్లతో నిర్మించిన నాగలదిన్నె వంతెన నిర్మాణం ఎమ్మిగ నూరు ప్రజలకోసం చేసిన శాశ్వత అభివృద్ధిగా మిగులుతుందని మంత్రి పేర్కొన్నారు. నాగలదిన్నె బ్రిడ్జిని పూర్తి చేయడం కోసం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పడ్డ శ్రమ, తపన మాటల్లో చెప్ప లేనిదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. 2009లో కర్నూలు వరదల వల్ల పాత వంతెన కొట్టుకు పోయిన తరుణంలో 2011లో కొత్త వంతెనను నాటి ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించు కున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. అనేక కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణానికి పదేళ్ల కాలం పట్టినా ఎట్టకేలకు పట్టువదల కుండా ఎన్ని అవాంతరాలొచ్చినా అధి గమించి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. ప్రజలకు ఎంతో అవసరమైన ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే అడగ్గానే అంగీకరించిన విషయాన్ని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. త్వరలోనే తుంగభద్ర నదికి అవతల ఉన్న రహదారిని మరింత సామర్థ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు.

# వైసీపీలో సీట్ల టెన్షన్...



గుంటూరు, డిసెంబర్ 20, వైసీపీ ఇప్పటి నుంచే రానున్న ఎన్నికల మీద దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పార్టీలో యాక్టివ్ గా లేని ఎమ్మెల్యేలకు, ఎంపీలకు సీట్లు ఇచ్చేందుకు అధిష్టానం సుముఖంగా లేనట్లు సమాచారం. అందుకే వారిని తాడేపల్లికి పిలిపించి జగన్ పర్సనల్ గా మాట్లాడుతున్నారు.ఏపీ పాలిటిక్స్ సమీకరణాలు రోజురోజుకి మారుతున్నట్లు తెలుస్తుంది. ముఖ్యమంత్రి జగన్ తన ఎమ్మెల్యేలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరితో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది. ఎప్పుడూ ఎవరికి తాడేపల్లి నుంచి ఫోన్ వస్తుందో అని భయపడతున్నారు. వైసీపీ ఎమ్మెల్యేల సీట్ల మార్పుల పై వైసీపీ ఇప్పటికే దృష్టి పెట్టింది. ఈ క్రమంలో జగన్ ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల మీద దృష్టిపెట్టారు. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలను క్యాంపు ఆఫీసుకు పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. మార్పులకు అవకాశాలు ఉండే నియోజకవర్గాలు..రాజమండ్రి రూరల్, పిఠాపురం, పత్తిపాడు, జగ్గంపేట, పి.గన్నవరం, రామచంద్రాపురం.నరసాపురం, పోలవరం, ఉండి, ఉంగుటూరు, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, తిరువూరు, అవనిగడ్డ, పెడన, దర్శి, పొన్నూరు, పెనుగొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం నియోజకవర్గాల మీద జగన్ ప్రత్యేక దృష్టిని పెట్టారు. ఇవి మాత్రమే కాకుండా మరి కొన్ని నియోజకవర్గాల మీద కూడా జగన్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.మరికొంత మందికి నియోజకవర్గంలో సరిగా పనులు చేయాలని వార్నింగ్ ఇచ్చేందుకు జగన్ పిలుస్తున్నారని సమాచారం. దీంతో కొందరు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా వారి వినతులు వినిపించేందుకు సీఎం క్యాంప్ ఆఫీసుకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తాడేపల్లికి చేరుకున్నారు. రాయలసీమనుంచి పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, ఎమ్మెల్యే కిలారు రోశయ్య, ఉమ్మారెడ్డిలతో పాటు మంత్రి ఉషశ్రీ చరణ్ కి కూడా క్యాంపు ఆఫీస్ నుంచి పిలుపు వచ్చింది. ఇప్పుడు చేపట్టే మార్పుల తరువాత పూర్తి స్థాయి దృష్టి ఎన్నికల మీద పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే టికెట్ ఇవ్వని వారికి వైసీపీ ముందుగానే చెప్పేస్తుంది.ఇప్పటికే 11 సెగ్మెంట్లలో మార్పులు చేర్పులు జరిగాయి. ఇప్పటికే ప్లేస్ మారిన వారిలో కొందరు మంత్రులు, మాజీ మంత్రులు ఉన్నారు. ఇప్పటికే మద్దాలిగిరి, టీజేఆర్ సుధాకర్ బాబు, తిప్పల నాగిరెడ్డి వచ్చే ఎన్నికల్లో నో టికెట్ అని వైసీపీ చెప్పేసింది. సెకండ్ టైమ్ లో మరో ఐదుగురికి ఉద్వాసన పలికే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల్లో పలువురు వైసీపీ సిట్టింగ్ నేతలకు వచ్చే ఎన్నికల్లో అవకాశం లేదు. గడిచిన వారం రోజుల నుంచి ఇప్పటి వరకు క్యాంప్ ఆఫీసుకు సుమారు 30 నుంచి 35 మంది ప్రజాప్రతినిధులు క్యూ కట్టారు. వీరిలో కొందరు ఎమ్మెల్యేలకు ఎంపీలుగా, ఎంపీలకు ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చేందుకు జగన్ రెడీ గా ఉన్నట్లు సమాచారం.

# భోగాపురం పోర్టు పనులు వేగవంతం..

విజయనగరం, డిసెంబర్ 20, గాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 4,750 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభిస్తే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావడంతో పాటు ప్రభుత్వానికి కూడా పెద్దఎత్తున ఆదాయం రానుంది. దీంతో అందరి దృష్టి విమానాశ్రయ నిర్మాణం పైనే పడింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ ఫోర్ట్ నిర్మాణానికి ఈ ఏడాది మే 3న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. కేవలం 36 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేయనున్నట్లు నిర్మాణ సంస్థ అధినేత జీఎంఆర్ శంఖుస్థాపన సభావేదికపైనే ప్రకటించారు. అయితే 36 నెలలు కాదు 30 నెలల్లోనే పనులు పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జి ఎమ్ ఆర్ ను కోరడంతో అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. అలా జి ఎమ్ అర్ హామీ ఇచ్చినట్లే శంకుస్థాపన జరిగిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మొదట ఎయిర్ పోర్ట్ నిర్మాణం ఆలస్యమవుతుందని అంతా భావించారు. అయితే తాజాగా ఉత్తరాంధ్ర వైసిపి ప్రజాప్రతినిధులు మీడియాతో కలిసి భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులు పరిశీలించారు. అలా సందర్శించిన ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనుల్లోని ప్రగతిని చూసి ఆశ్చర్యపోయారు. భారీ అధునాతన యంత్రాలు, వందలాది మంది కార్మికులతో కలిసి రాత్రింబవళ్ళు పనులు జరుగుతున్నాయి. జరుగుతున్న నిర్మాణ పనులను చూస్తుంటే 2025 డిసెంబర్ నాటికి భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని తెలుస్తుందిఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి మొత్తం 2,203 ఎకరాల భూమిని జీఎంఆర్ సంస్థకు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ స్థలంలో 3.8 కిలో మీటర్ల రన్ వే తో ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరుగుతుంది. ఇందుకోసం సుమారు 4.750 కోట్లు వెచ్చించనుంది జి ఎమ్ ఆర్ సంస్థ. ఎయిర్ పోర్ట్ చుట్టూ సుమారు 23 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన ప్రహరీగోడలో ఇప్పటికే దాదాపు 16 కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తి అయ్యింది. ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనుల్లో కొంతమేర పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టి కి అప్పగించింది జి ఎమ్ ఆర్. అంతేకాకుండా మరికొన్ని పనులు జీఎమ్ ఆర్ సంస్థ నేరుగా నిర్మాణాలు చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో విమానాశ్రయాల నిర్మాణాల్లో పేరుపొందిన జీఎమ్ఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లిఖార్జనరావు తన సొంత జిల్లా విజయనగరం జిల్లా కావడం, ఆ జిల్లాలోనే భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంను తానే చేపట్టడంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేగవంతంగా పనులు జరుపుతున్నారు. మరోవైపు ఈ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనుల్లో జరుగుతున్న ప్రగతి పై సమీక్షిస్తూ దూకుడు పెంచుతున్నారు.

# ఆరోగ్యస్మార్ట్ కార్డులు...

నెల్లూరు, డిసెంబర్ 20, ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యశ్రీ పరిధిని ఇకపై రూ. 25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా ఉచితంగా వైద్యం అందించనున్నారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి చికిత్సకు ఉచితంగా వైద్యం అందనుంది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇప్పటివరకూ రూ. 5 లక్షల వరకూ ఉన్న పరిమితిని రూ. 25 లక్షలకు పెంచింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోటీ 48 లక్షల కుటుంబాల్లోని నాలుగు కోట్ల 25 లక్షల మందికి ఉచిత సేవలు అందించేలా కొత్త కార్డులు జారీ చేస్తోంది. మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కార్డుల జారీని ప్రారంభించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. గతంలో ఉండే ఆరోగ్యశ్రీ కార్డుల కంటే ఈసారి ఆధునిక టెక్నాలజీతో అప్ గ్రేడ్ చేసిన స్మార్ట్ కార్డులను లబ్దిదారులకు అందిస్తుంది. ఈ స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెబుతోంది రాష్ట్ర ప్రభుత్వం. స్మార్ట్ కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రోగికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి. రోగికి ఉన్న సమస్యలు, గతంలో చేయించుకున్న చికిత్సకు సంబంధించిన వివరాలు, ఉపయోగించిన మందులు, ఇలా అన్ని అంశాలు పొందుపరిచి ఉంటాయి. దీని ద్వారా పేషెంట్ ఎన్నిసార్లు ఆసుపత్రికి వెళ్లినప్పటికీ వారికి ఎలాంటి వైద్యం అవసరమవుతుందనేది డాక్టర్లు సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ యాప్ ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సమయంలోనే లబ్ధిదారుల మొబైల్ ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్ లోడ్ చేస్తారు. ఈ యాప్ లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి సంబంధించిన ఆసుపత్రుల వివరాలు,ఏ హాస్పిటల్‌లో ఏ రోగానికి వైద్యం అందుతుందనే అన్ని వివరాలు ఉంటాయి.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ లో కీలక మార్పులు తీసుకొచ్చింది. గతంతో పోలిస్తే చికిత్సల సంఖ్య పెంచడం, ప్యాకేజీలు పెంచడంతో పాటు హాస్పిటల్స్‌ను కూడా పెంచింది జగన్ ప్రభుత్వం. ప్రస్తుతం సంవత్సరానికి 5 లక్షల ఆదాయం ఉన్న కుటుంబాలను కూడా ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకు వచ్చింది. దీని ద్వారా కోటీ 48 లక్షల కుటుంబాలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చాయి. 4 కోట్ల 25 లక్షల మంది ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు 1,059 ప్రొసీజర్లకు ఆరోగ్య శ్రీ సేవలు అందేవి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా 3వేల 257 ప్రొసీజర్లకు ఉచిత చికిత్సలు అందిస్తుంది జగన్ సర్కార్.ఇక, గతంలో ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు 748 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఇతర రాష్ట్రఆల్లో కలిపి 2వేల 513 హాస్పిటల్స్‌కు ఆరోగ్యశ్రీ సేవలు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2,309 ఆసుపత్రులతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో కూడా రిఫరల్ ఆసుపత్రులున్నాయి. హైదరాబాద్‌లో 85, బెంగుళూరులో 35, చెన్నైలో 16 ఆస్పత్రులతో కలిపి మొత్తం 204 ఇతర రాష్ట్రాల ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తుంది. ఇంత పెద్ద ఎత్తున ఏ రాష్ట్రంలో కూడా ఉచిత వైద్య సేవలు అందడం లేదని ఏపీ సర్కార్ చెప్పుకొస్తుంది.రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 19 నుంచి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. కార్డుల పంపిణీ మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిధి పెంపు, ఇతర సౌకర్యాలపై విస్తృతంగా ప్రచారం చేయనుంది రాష్ట్ర ప్రభుత్వం. ప్రతి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో రోగ్యశ్రీ ప్రచార కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి వారం మండలానికి నాలుగు గ్రామాల చొప్పున ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశా వర్కర్లతో పాటు ప్రజాప్రతినిధులు స్మార్ట్ కార్డుల పంపిణీతో పాటు ఆరోగ్యశ్రీ యాప్ డౌన్ లోడ్ చేసి వాటిపై ప్రచారం చేయనున్నారు.

## సంక్రాంతికి సీట్ల సర్దుబాటు

విజయవాడ, డిసెంబర్ 20, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లిన చంద్రబాబు నాయుడు దాదాపు రెండున్న గంటల పాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చంద్రబాబును పవన్ కళ్యాణ్ సాదర స్వాగతం పలికారు. రెండున్నర గంటలపాటు సుదీర్ఘంగా సాగిన కీలక భేటీలో పలు రాజకీయ అంశాలపై ఇరు పార్టీల అధినేతలు చర్చించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు."ఇరు పార్టీల అధినేతల భేటీ చాలా సంతృప్తికరంగా సాగిందని, అనేక అంశాలపై చర్చలు సుహృద్భావంగా జరిగాయని నాదెండ్ల చెప్పారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధనే ఉమ్మడి ధ్యేయంగా వచ్చే ఎన్నికల్లో సమష్టిగా ఎలా ముందుకు వెళ్లాలనే దానిపైనా, ఉమ్మడి మేనిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలోనూ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు.వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఎలా ముందుకు వెళ్లాలి..? దాని కోసం ప్రత్యేక వ్యూహంపైనా ఓ సమష్టి కార్యాచరణ తీసుకున్నామన్నారు. భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ గురించి, ఎన్నికల యాక్షన్ ప్లాన్ గురించి చర్చించిన్టు నాదెండ్ల తెలిపారు.ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఇరు పార్టీల అధినేతలు పూర్తి స్థాయిలో చర్చించారని వైసీపీని ధీటుగా ఎదుర్కోవడమే కాకుండా, వైసీపీ విముక్త రాష్ట్రాన్ని సాధించేందుకు అవసరం అయిన అన్ని విషయాల పట్ల పూర్తిస్థాయి చర్చ జరిగిందని చెప్పారు. పార్టీ అధినేతల మధ్య జరిగిన భేటీలో చర్చకు వచ్చిన ఇతర కీలకమైన అంశాల గురించి తర్వాత ప్రత్యేకంగా మాట్లాడుతామని చెప్పారుసీట్ల సర్దుబాటుపై తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం సుదీర్ఘంగా చర్చించినట్టు తెలుస్తోంది. మరికొన్ని సమావేశాల తర్వాత.. సంక్రాంతి నాటికి ఇది కొలిక్కి రానున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి మ్యానిఫెస్టో పైనా ఇద్దరు నేతలూ చర్చించారు.ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయాలి? ఎక్కడ నుంచి బరిలో దిగాలనే అంశంపై నేతలు చర్చించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఏయే అంశాలు పెట్టాలి? దాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపైనా ఇద్దరి మధ్య చర్చ నడిచింది. ఉమ్మడిగా బహిరంగ సభల నిర్వహణ, ఎక్కడెక్కడ సభలు నిర్వహించాలి, ఎవరెవరు హాజరవ్వాలి? వాటిని ఎప్పట్నుంచి ప్రారంభించాలనే అంశాలపైనా ఇద్దరు నేతలూ చర్చించారు. అన్నీ కొలిక్కి వచ్చాక.. బహిరంగ వేదికపైకి వచ్చి కీలక నిర్ణయాలను వెల్లడించనున్నారు.ఇదే వేదికపై నుంచి ఉమ్మడి మ్యానిఫెస్టో కూడా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన శ్రేణులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో కలిసి పనిచేస్తున్నాయి. ఓట్ల అక్రమాలపై అధికార పార్టీ తీరును ఎండ గడుతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ అంశాల్లో అధికారపార్టీ అక్రమాలను అడ్డు కోవడంతో పాటు అసత్య ప్రచారాల్ని ఎలా తిప్పికొట్టాలనే విషయంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు

## ఫ్యాన్ క్రిందకు ముద్రగడ...

కాకినాడ, డిసెంబర్ 20, కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. గతంలో ఎప్పటినుంచో ఆయన చేరికపై వార్తలు వస్తున్నా.. తాజాగా ముద్రగడ చేరికకు ఓకే అన్నట్లు తెలుస్తోంది. మళ్లీ యాక్టివ్ రాజకీయాల్లో పాల్గొనాలని ఆయన కోరుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన వైసీపీలో చేరితే పోటీ చేస్తారా లేకపోతే.. కుమారుడికి టిక్కెట్ అడుగుతారా అన్నది తేలాల్సి ఉంది. అయితే పార్టీ హైకమాండ్ ఆయనకు పెద్దాపురం సీటును ఆఫర్ చేసినట్లుగా తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెద్దాపురం నుంచి తోట నరసింహం భార్య పోటీ చేశారు. ఈ సారి తోట నరసింహానికి జగ్గంపేట టిక్కెట్ ఇవ్వాలని వైసీపీ హైకమాండ్ నిర్ణయించింది. కాపు రిజర్వేషన్ల ఉద్యమ కర్తగా ముద్రగడ వ్యవహరించారు. గతంలో ఆయన కాపు రిజర్వేషన్ల కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వంతో ఢీ అంటే



ఢీ అన్నట్టుగా వ్యవహరించారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చినా ఆయన పెద్దగా యాక్టివ్ కాలేదు. టీడీపీ, జనసేన పొత్తుల కారణంగా కాపు ఓటు బ్యాంక్ చెదిరి పోకుండా ముద్రగడను పార్టీలో చేర్చుకోవాలని అనుకున్నారు. గతంలో పవన్ వారాహి యాత్రలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై విమర్శలు చేసినప్పుడు ముద్రగడ పవన్ పై విరుచుకుపడ్డారు. అప్పుడే ఆయన వైసీపీలో చేరుతారన్న ప్రచారం జరిగింది. ఇప్పుడువచ్చే ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేస్తున్న సీఎం జగన్ వైసీపీ ఇన్ చార్జులను మారుస్తున్నరు. ఈ క్రమంలో ఆయన పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. తన కన్నా.. తన కుమారుడు చల్లారావు భవిష్యత్ కోసం అధికార పార్టీలో చేరేందుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ ఇన్ చార్జిగా ఉన్న మిథున్ రెడ్డితో పలువురు ముద్రగడ ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. తమ కుమారుడి భవిష్యత్ కు బాటలు వేసేందుకు ఇదే అనువైన సమయమని ఆయన భావించారు. ఇదే విషయమై క్లారిటీ వస్తే ముద్రగడ చేరిక దాదాపు ఖరారైనట్టే. ఆమేరకు మార్పులు చేర్పులు చేస్తున్నట్టు వైసీపీ నుంచి స్పష్టమైన హామీ వచ్చినందునే ముద్రగడ పార్టీలో చేరేందుకు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

# ఇంటింటి ప్రచారంలో కమలం నేతలు

అనంతపురం, డిసెంబర్ 20, ఏపీ బీజేపీ విషయంలో ఆ పార్టీ హైకమాండ్ ఓ వ్యూహం ప్రకారం ముందుకు వెళ్తున్నట్లుగా రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. సొంతంగా పోటీ చేయడమా, పొత్తులతో పోటీ చేయడమా అన్నదానిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కానీ రాష్ట్ర నేతలకు మాత్రం కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా పని చేసుకోవాలని సూచించినట్లుగా చెబుతున్నారు. రాయలసీమలోని హిందూపరం పార్లమెంట్ నియోజకవర్గంలో ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్ రెడ్డి ఇటీవలి కాలంలో రాజకీయ కార్యకాలాపాలు పెంచారు. ఎన్నికల వరకూ అక్కడే పని చేసుకోవాలని హైకమాండ్ సూచించినట్లుగా చెబుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఓ వైపు ప్రభుత్వంపై పోరాటం.. మరో వైపు కేంద్ర సర్కార్ విజయాల ప్రచారం చేస్తూ.. ప్రజల్లోకి . వెళ్తున్నారు. ఇంటింటికి బీజేపీని తీసుకెళ్లే ఆలోచన చేస్తున్నారు. దీనిపై ఆయన కార్యాచరణ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం భారత్ ను ప్రపంచశక్తిగా మారుస్తోందని. ఈ క్రమంలో అనేక విజయాలు సాధిస్తోందని బీజేపీ ఇప్పటికే ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అలాగే రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతోంది. ఏపీలో ఎక్కడైనా అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే దానికి కారణం కేంద్ర ప్రభుత్వ నిధులే. అయినప్పటికీ ప్రచారం మాత్రం పెద్దగా రావడం లేదు. ఈ లోపాన్ని గుర్తించిన విష్ణువర్ధన్ రెడ్డి హిందూపురం పార్లమెంట్ పరిధిలో ప్రతి ఇంటికి మోదీ ప్రభుత్వ విజయాలు, రాష్ట్రంలో కేంద్రం సాయంతో జరుగుతున్న పనులు, పథకాల గురించి వివరించాలని నిర్ణయించారు. విద్యుత్ చార్జీల పెంపుపై విష్ణువర్ధన్ రెడ్డి వారం రోజులుగా ధర్నాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంపై అసంతృప్తి కూడా కనిపిస్తోంది. విద్యుత్ చార్జీల భారం ప్రజల్ని కుంగదీస్తోంది. ప్రతిపక్ష పార్టీలు పట్టించుకోవడం లేదు. ఈ సమస్య చాలా తీవ్రంగా ఉందని గుర్తించిన బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి రంగంలోకి దిగారు. హిందూపురం పార్లమెంట్ మొత్తం వారం రోజుల పాటు ఆందోళనలకు పిలుపునిచ్చారు.



# పశువులకి దాన పంపిణీ



కోసిగి, డిసెంబర్ 20(విభారె న్యూస్) మండల పరిధిలోని పల్లెపాడు గ్రామనీలో రిలయన్స్ ఫౌండేషన్ మరియు ఆర్డీప్ సంస్థల ఆధ్వర్యంలో పశువులకు దాన పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డీప్ కార్యకర్త భీమేష్ మాట్లాడుతూ మన దేశం వ్యవసాయంతో పాటు పశు పోషణలో కూడ అభివృద్ధి సాదించాలని మరియు మన యొక్క జీవనోపాదులు కూడా పెంచుకోవాలని కోరారు. అదేవిదంగా ప్రస్తుతం బర్రెలకు మేకలకు ఆవులకు రోగ నిరోధక శక్తి తగ్గి,పాల ఉత్పత్తి తగ్గుతుంది, సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియచేసారు పచ్చి, ఎండూ గడ్డి మాత్రమే కాకుండా మంచి పోషకాలు కలిగిన పశుగ్రసం దాణా వంటివి పశువులకు అందించాలి కాబట్టి పరిస్థితి లనుదృష్టిలో ఉంచుకోని ముందు గానే రిలయన్స్ ఫౌండేషన్ మరియు ఆర్డీప్ సంస్థ అవగాహన మరియు శిక్షణలు ఏర్పాటు చేసి మెలకువలు, జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. రోగ నిరోధక శక్తి పాల ఉత్పత్తిని పెంచాలని ఉద్దేశంతో వాళ్లకి ఉచితంగా దాన పంపిణీ చేయడం జరిగింది ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.రైతులకు పోషణ విలువలు కూడిన దాన ఉచితంగ అందిచడం జరిగింది. అదేవిధంగా ఎక్సపోజర్ విజిట్ కి హాజరు కావాలని తెలియజేశారు.మిగతా ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ 18004198800 నెంబర్ ని సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్ర నాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ హైమావతి, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.


## క్రీడాకారులను అభినందించిన గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి...



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 20-నంద్యాల పట్టణం గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూలు క్రీడాకారులు జాతీయస్థాయి త్రోబాల పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్ పి షేక్షావల్లి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా షేక్షావల్లి రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12 వరకు నంద్యాల కేవిఎం మున్సిపల్ స్కూల్లో ఎస్ జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. పోటీల్లో అండర్ 14 విభాగంలోఅక్షయజ్యోతి,మణికంఠ,జాతీయ స్థాయికి ఎంపికయ్యా రని తెలిపారు.ఈనెల 12 నుంచి 14 వరకు కెవిఎం మున్సిపల్ స్కూల్లో జరిగినటువంటిత్రోబాల్ పోటీలలోఅండర్- 17 విభాగం లో కే.పాండురంగ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో సంతోషంగా ఉందన్నారు.ఈనెల20న పాఠశాలఆవరణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న క్రీడాకారులకు గురురాజా విద్యా సంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి మెడల్స్, ప్రశంస పత్రాలతో క్రీడాకారులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో త్రోబాల్ క్రీడలో విజయం సాధించేందుకు కోసం కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడుసుబ్బారావును అభినందించారు.

# శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 37 వ రోజు అన్న ప్రసాద వితరణ..





విభారె న్యూస్ డిసెంబర్ 20 ఎమ్మిగనూరు..శ్రీ హరిహర పుత్రలఅయ్యప్పస్వామి దేవాలయం లో స్వాములకు ( అన్న ప్రసాద వితరణ) కార్యక్రమం లో భాగంగా ఈరోజు 37వరోజు20- 12- 2023 బుధవారం దాతలు ఎమ్మిగనూరు వాస్తవ్యులు. వి. నేహంత్ సాయి నందీష్ పుట్టినరోజుసందర్భంగావారిదంపతులువారి సేవా వి.నరసింహుడు,శ్రీమతిరేఖామాధురి,అగ్రికల్చర్ఏ.ఈ.ఓ. లుమంత్రాలయం మండలం, నరసింహారెడ్డి శ్రీమతి లత(ఫ్రెండ్స్ ఫామ్) రాజేష్ శ్రీమతి మాధురి(లక్ష్మీ రంగా ట్రేడర్స్)ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినారు.వారిని వారి కుటుంబాలకు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి. కృపా కటాక్షములు ఉండాల ని, ఎల్లవేళలా ఆయు రారోగ్యాలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిస్వామి వారిని ప్రా ర్థిస్తూ.. .ఆలయంలో అన్నదా నం పెట్టదలచుకున్న దాతలు కమిటీ వారిని సంప్రదించి తగు తేదీలను .అదేవిధంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని, స్వామి వారి కృపా కటాక్షములు పొందగలరని కోరుతున్నాము..ఇట్లు - ఆలయకమిటీ సెల్: 9951801818..

# బోర్లకు విద్యుత్ మీటర్లు వెనక్కి తీసుకోవాలి. సిపిఐ రైతు సంఘం.





కోసిగి, డిసెంబర్ 20 (విభారె న్యూస్) మండల కేంద్రమైన కోసిగిలో సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యల పైన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి రైతు సంఘం తాలూకా అధ్యక్షులు ఎం గోపాల్ మాట్లాడుతూ ఖరీఫ్ రబీలో రైతులు వేసిన పంటలకు సరిగ్గా పంటలు పండక తీవ్రంగా నష్టపోవడం జరిగింది ఇప్పుడున్న పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అమర్చుతమని కోసిగి మండలంలో విద్యుత్ అధికారులు రైతులకు పొలాలకు వెళ్లి అదేవిధంగా ఇంటి దగ్గరకు వెళ్లి ఆధార్ కార్డులు అకౌంట్ లో బిల్లులు అడుగుతున్నారు ఇప్పటికే రైతులు అప్పుల పాలు అయి ఆందోళన చెందుతున్నారు ఇంతవరకు వ్యవసాయ మోటార్లకు ఉచితంగా కరెంటు అందించేవారు అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వము స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులను దృష్టిలో ఉంచుకొని కరెంటు చార్జీలు మాఫీ చేసి ఆయన ఉన్నంతవరకు వ్యవసాయ బోర్లు కు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేవారు కానీ ఇప్పుడు ఆయన కుమారుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగిస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు ఒకవేళ మీటర్లు బిగిస్తే రైతులు వ్యవసాయ కలెక్షన్లు ఉరితాడు వేసుకొని ఆత్మహత్యకు దారితీస్తుంది అని పేర్కొన్నారు దీనిని వెంటనే వెనక్కి తీసుకొని రైతులకు నష్టపోయిన పంటలకు ఒక ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అదేవిధంగా బ్యాంకుల్లోన క్రాప్ రుణాలు తీసుకున్న వాళ్లకి తీవ్రంగా బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు వడ్డీ కట్టలేని రైతుల దగ్గర వాళ్లని తిరిగి రెన్యువల్ చేసుకోవాలని అదేవిధంగా బ్యాంకులోనా క్రాప్ రుణాలు రెండు లక్షల రూపాయలు మాఫీ చేయాలని సిపిఐ రైతు సంఘం డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఓంకార స్వామి ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్ రాజేంద్ర రైతులు దావీదు ఈరన్న పాల్గొనడం జరిగింది.

# ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల ద్వారా 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స సేవలు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 20- డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా సరికొత్తగా 25 లక్షల రూపాయల విలువైన వైద్య చికిత్సలను అందించేందుకు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం నంద్యాల పట్టణం36వవార్డులోకౌన్సిలర్నాగినిరవిసింగారెడ్డి లబ్ధిదారులకు డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. హెల్త్ ఆఫీసర్ డా. అంకిరెడ్డి వార్డు ఇన్చార్జి పూర్ణిమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలోని ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని, ప్రధానంగా విద్యా, వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వైద్య రంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ పేదలందరికీ నాణ్యమైన సురక్షితమైన వైద్యాన్ని, వైద్య సేవలను అందించేందుకుగాను సరికొత్తగా 25 లక్షల రూపాయల వరకు వివిధ వైద్య సేవలను అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. పేదలందరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను ఈ ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డు ద్వారా పొందవచ్చన్నారు.

# వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ...





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 20 డోన్ పట్టణానికి చెందిన విజయ స్టోర్స్ యజమాని తిరువీధి సురేష్ మరియు వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ పట్టణంలోని వైస్సార్ నగర్ లో వున్న ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు తిరువీధి సురేష్ మాట్లాడుతూ చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వృద్ధులకు దుప్పట్లు ఇవ్వడం జరిగిందన్నారు. కన్నవారికి, సొంత కుటుంబానికి దూరమై వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులను గౌరవించడం, ఆదరించడం మన బాధ్యతని అన్నారు. దుప్పట్లు అందించిన దాతలకు ఆశ్రమ వృద్ధులు, నిర్వాహకులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, స్ఫూర్తి సభ్యులు జగదీష్, వసంత్, ఆశ్రమ నిర్వహకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు....ఎస్ఎఫ్ఐ





ఎమ్మిగనూరు టౌన్ .డిసెంబర్ 20 విభారె న్యూస్:- రాష్ట్రవ్యాప్తంగా గత తొమ్మిది రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగన్న, పట్టణ కార్యదర్శి విజయ్ అన్నారు. అంగన్వాడీ నిరసన శిబిరంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల రాష్ట్రంలో 55 వేల అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయని విమర్శించారు. దీనివల్ల పేద గర్భిణీలు ,బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారానికి దూరమయ్యారని అన్నారు. ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి తెలంగాణ అంగన్వాడీల కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తామని మాట ఇచ్చి, తన ప్రభుత్వం ఏర్పడ్డాక నెరవేర్చలేదని మాట ఇచ్చి ఇప్పుడు మడమ తిప్పడం జరిగిందన్నారు. విశాఖలో రాజధాని పేరు అక్కడ కార్యాలయాలకు రూ450 కోట్ల ఖర్చు పెడుతున్నారని, అంగన్వాడీ జీతాల మాత్రంపెంచకపోవడంశోచనీయమన్నారు. ఒకపక్క చర్చలు అంటూనే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని, అంగన్వాడి గృహాల తాళాలు వాటి నిర్వహణ వేరే శాఖలకు అప్పగించాలని చూస్తున్నారని, ఇది అంగన్వాడీల హక్కులను కాలరాయడమేనన్నారు. న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కల్లపరి వర్కూర్ గ్రామలలో...



విభారె న్యూస్ డిసెంబర్ 20 కోడుమూరు..భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ మాట్లాడుతూ మన భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్క గ్రామానికి ప్రజలకు తెలియజేయాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో అధికారులు ఎండిఓ చంద్రశేఖర్ డాక్టర్ మదన్ అంగన్వాడీ ఏవో రాధ యస్ ఐ శ్రీనివాసులు అగ్రికల్చర్ ఏఈ రవిప్రకాష్ ప్రజా ప్రతినిధులు సర్పంచులు కల్లపరి రంగమ్మ వర్కూర్ లక్ష్మీదేవి కోడుమూరు మండలం కల్లపరి వర్కూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతిదగ్గుపాటిపురందేశ్వరి సూచనలతో జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ ఆదేశాలతో మేరకు ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మల్లేష్ నాయుడు మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి కోడుమూరు మండల అధ్యక్షులు షణ్ముఖఆచారి నరేష్ వర్కూర్ కృష్ణన్న రాంబాబు రాజేష్ రాముడు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నా కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మన గ్రామాలకు వస్తున్న సందర్భంగా గ్రామ ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకొని అధికారుల సమక్షంలో మీకు పరిష్కరించే దిశగా మన భారత ప్రధాని నరేంద్రమోడీ ఇస్తున్నటువంటి పథకాలను అధికారులను అడుగుతూ వారు విని వెంటనే స్పందించడం జరుగుతున్నది కనుక గ్రామాలలో ఉన్నటువంటి ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము.

## భిక్షాటన చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

ముదిగుబ్బ డిసెంబర్ 20 ముదిగుబ్బలో అంగన్వాడీల సమ్మె లో భాగంగా తొమ్మిదో రోజు కరెంట్ ఆఫీస్ నుంచి బస్టాండు కూడలి వరకు భిక్షాటన చేసుకుంటూ అంగన్వాడి కార్యకర్తలు నిరసన తెలియజేశారు.వారికి మద్దతుగా సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, పోతలయ్య, మధుసూదన్ రెడ్డి, బాబు, పాల్గొని సమ్మెను మరింత ఉధృతం చేశారు. అలాగే అంగన్వాడి కార్యకర్తల జీవన పరిస్థితిలు రోజురోజుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో పెద్దన్న, పోతలయ్య, బాబు, మధుసూదన్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**